సాక్షి నల్లగొండ

సోమవారం ၊ 17 ၊ ఫిబ్రవరి ၊ 2025



చేనేత సంఘాల గడుపు పెంపు

చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్ చార్జిలనే కొనసాగిస్తూ ప్రభుత్వం మరో ఆరు నెలలు గడువు పొడిగించింది. - 8లో



ఎన్నికల వాయిదా సరికాదు

రిజర్వేషన్ల పేరుతో స్థానిక ఎన్నికలు వాయిదా వేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 8లో



వాహనాల దారి మళ్లింపు

పెద్దగట్టు జాతర దృష్ట్యా విజయవాడ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

నల్లగొండ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దగట్టు (దురాజ్‌పల్లి) జాతర సందర్భంగా లోకల్ హాలీడే ప్రకటించినట్లు పేర్కొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అంజన్‌రావు

మర్రిగూడ: పదో తరగతిలో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాలరాజు, యాదయ్య, శ్రీరాములు ఉన్నారు.

బుద్ధవనం సందర్శించిన జిల్లా అటవీశాఖ అధికారి



బుద్ధవనంలో జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ మిత్రబృందం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, ఆయన మిత్ర బృందం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధ చరిత వనం, ధ్యానవనం, జాతకవనం, స్థూప నాలను సందర్శించారు. బుద్ధవనంలోని మహాస్థూపం ధ్యానమందిరంలో ధ్యానం చేశారు.

నారసింహుడికి సంప్రదాయ పూజలు



స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమాన్ని అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా జరిపించారు. అనంతరం గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవను ఆలయంలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



విద్యుత్ వెలుగుల్లో లింగమంతులస్వామి ఆలయ పరిసరాలు

లింగమయ్యా.. దీవించయ్యా..

వైభవంగా గొల్లగట్టు జాతర ప్రారంభం

- కేసారంలో దేవరపెట్టెకు ప్రత్యేక పూజలు
- అర్ధరాత్రి కాలినడకన పెట్టెను గట్టుకు చేర్చిన భక్తులు
- ఆకట్టుకున్న మందగంపల ప్రదక్షిణ





దేవస్థానం చుట్టూ మందగంపలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

నేడు చౌడమ్మకు బోనాలు

జాతరలో రెండో రోజు సోమవారం చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా మెంతబోయిన వంశస్తులు తెచ్చిన తొలి గొర్రె (తల్లి గొర్రె), మున్న వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డిగొర్ల వంశీయులు తెచ్చిన వర్ధ గొర్రెను అమ్మవారి ముందు జడత పడుతారు. అనంతరం అమ్మవారికి బలి ఇస్తారు.



చివ్వెంల/సూర్యాపేట టౌన్: గజ్జెల లాగుల గలగలలు, కటార్ల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల పూనకాల నడుమ లింగా.. ఓ లింగా నామస్మరణతో పెద్దగట్టు మార్మోగింది. మేడారం జాతర తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతుల స్వామి జాతర (పెద్దగట్టు జాతర) ఆదివారం ప్రారంభమైంది. యాదవులు సంప్రదాయ దుస్తులు ధరించి భేరీల చప్పుళ్లతో సందడి చేశారు. ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలతో పాటు ఇతర వాహనాల్లో యాదవులు, భక్తులు ఆదివారం అర్ధరాత్రికే గట్టుకు చేరుకున్నారు.

అర్ధరాత్రి గట్టుకు చేరిన దేవరపెట్టె..

ముందుగా సూర్యాపేట మండలం కేసారంలో ఆదివారం రాత్రి దేవరపెట్టెకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొర్ల గన్నారెడ్డి ఇంటి నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మెంతబోయిన లింగస్వామి ఇంటి నుంచి ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పట్టు వస్త్రాలు తీసుకొచ్చి దేవతామూర్తులకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం యాదవులు, ఇతర కులాలవారు కాలినడకన దేవరపెట్టెను ఊరేగింపుగా పెద్దగట్టు వద్దకు చేర్చారు. అనంతరం ఆలయానికి పడమటి వైపుఉన్న మెట్ల ద్వారా గొల్లగట్టుపైకి చేరి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మెంతబోయిన, మున్న, గొర్ల వంశస్తులు దేవరపెట్టెకు పూజలు నిర్వహించారు.

ఆలయం చుట్టూ మందగంపల ప్రదక్షిణ

మున్న మెంతబోయిన వంశస్తులకు చెందిన ప్రతి ఇంటి నుంచి మహిళలు మందగంపలతో జాతరకు తరలివచ్చారు. ఆదివారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



కేసారం నుంచి పెద్దగట్టుకు దేవర పెట్టెను తరలిస్తున్న యాదవ కులస్తులు



ట్రాక్టర్లపై జాతరకు తరలివస్తున్న భక్తులు

ప్రజా సమస్యలు పరిష్కరించడంలోనే సంతృప్తి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజా దర్బార్‌లో బాధితుల సమస్యలు వింటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కలిగే సంతృప్తి మరెందులో రాదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న పార్కులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రిగా ఉన్న ఎంత బిజీగా ఉన్నప్పటికీ నల్లగొండ నియోజకవర్గ ప్రజల కోసం ప్రజాదర్బార్‌ను కొనసాగిస్తామని తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజాదర్బార్‌కు అధికారులను పిలువలేదని పేర్కొన్నారు.

నేడు మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

నల్లగొండ టూటౌన్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఈ నెల 17న ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీ ఎదుట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎదుట మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రాణాపాయం నుంచి రక్షించేలా..

- జీజీహెచ్‌లో పూర్తికావొస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు
- 80 పడకల సామర్థ్యంతో రెండు బ్లాక్‌ల నిర్మాణం
- నెల రోజుల్లో అందుబాటులోకి రానున్న ఒక బ్లాక్

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.24 కోట్ల వ్యయంతో 80 పడకల సామర్థ్యం గల క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. రెండు బ్లాకులుగా చేపట్టిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను మరో రెండు నెలల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ఆసుపత్రి వర్గాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ యూనిట్‌లో ఆధునిక ఐసీయూ, ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి సేవలు అందించేందుకు జీజీహెచ్ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ యూనిట్ ప్రారంభమైతే జిల్లాలోని ప్రాణాపయస్థితిలో మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, నకిరేకల్ ఆస్పత్రుల నుంచి అత్యవసర వైద్య సేవల కోసం రిఫర్ చేసే రోగులకు ప్రయోజనం చేకూరనుంది.

ప్రాణాపాయస్థితిలో చికిత్స..

ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 20 పడకలతో ఐసీయూ విభాగం, మరో 20 పడకలతో అత్యవసర విభాగంలో ప్రాణపాయ స్థితిలో ఉన్న రోగులకు చికిత్స అందిస్తున్నారు. అయితే జిల్లాలోని ఏరియా ఆసుపత్రి నుంచి అత్యవసర వైద్య సేవల కోసం రిఫర్ చేస్తున్న రోగులకు మంచాలు సరిపోవడం లేదు. దీంతో వారిని హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది.

ఒక యూనిట్‌లో తొలుత ఓపీ సేవలు..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణం కోసం పాత భవనాన్ని కూల్చివేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం కూల్చివేశారు. ప్రస్తుతం పాత భవనంలో నిర్వహిస్తున్న ఓపీ సేవలు, బ్లడ్ బ్యాంకు, తెలంగాణ హబ్‌లకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు వరకు క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఒక బ్లాక్‌లో అవుట్ పేషెంట్ సేవలను, బ్లడ్ బ్యాంకు, తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లను నిర్వహించేందుకు ఆసుపత్రి వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. మరో బ్లాక్‌లో రెండు నెలల తర్వాత క్రిటికల్ కేర్ సెంటర్ సేవలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కూల్చివేసిన పాతభవనం స్థానంలో కొత్త భవన నిర్మాణం పూర్తయితే క్రిటికల్ కేర్ యూనిట్‌లో రెండు బ్లాక్‌లు అందుబాటులోకి వచ్చి 80 పడకల సామర్థ్యంతో అత్యవసర సేవలు అందనున్నాయి.



నిర్మాణం పూర్తి కావొస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్

మహిళా సంఘాలకు అందని కమీషన్

- మంజూరు కాని ధాన్యం కొనుగోళ్ల నిధులు
- రూ.35.63 కోట్లు పెండింగ్

నల్లగొండ: మహిళా సమభావన సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఐకేపీ ద్వారా మహిళా సంఘాలకు అప్పగించింది. ఇందులో భాగంగా మహిళా సంఘాలే డీఆర్‌డీఏ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ వస్తున్నాయి. అయితే నాలుగు సీజన్లుగా కోట్ల రూపాయల కమీషన్ ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నా మంజూరు చేయకపోవడంతో ఎదురుచూపుల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

నాలుగు సీజన్లుగా అందని కమీషన్..

ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీలో మహిళా సంఘాలు ధాన్యం కొనుగోలు చేస్తుంటాయి. వారితో పాటు ప్రాథమిక సహకార సంఘాలు, రైతు పరస్పర సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ వస్తున్నారు. నాలుగు సీజన్ల నుంచి కమీషన్ విడుదల చేయకపోవడంతో మహిళా సంఘాలు ఇబ్బందులు పడుతున్నాయి.

నెరవేరని ప్రభుత్వ ఉద్దేశం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కమీషన్ డబ్బులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరడం లేదు. మహిళా సంఘాలు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం సకాలంలో ప్రభుత్వం నుంచి కమిషన్లు అందక వారు అనుకున్న లక్ష్యాలను అందుకోలేని పరిస్థితి నెలకొంది.

రూ.35.63 కోట్ల బకాయిలు

నాలుగు సీజన్లకు సంబంధించి మహిళా సంఘాలకు రూ.35,63,66,446 కమీషన్ చెల్లించాల్సి ఉంది. ఇందులో 2022–23 రబీకి సంబంధించి రూ.66,41,0787 చెల్లించాల్సి ఉండగా 2023–24లో ఖరీఫ్‌కు సంబంధించి రూ.10,32,81,254 చెల్లించాల్సి ఉంది. 2023- 24 రబీకి సంబంధించి రూ.9,84,05,849 చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా 2024- 25 ఖరీఫ్‌కు సంబంధించి రూ.8,82,68,556 చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ.35.63 కోట్లు చెల్లించాల్సి ఉంది.

చికెన్ అమ్మకాలు డౌన్

వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు

- గతంలో ఒక్క ఆదివారమే 1.80లక్షల కేజీలకు పైగా అమ్మకాలు
- బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కేవలం 50వేల కేజీలు విక్రయించిన వ్యాపారులు



నల్లగొండ టూటౌన్: ఆదివారం వచ్చిందంటే చాలు దాదాపు ప్రతి ఇంట్లో చికెన్ ఉండాల్సిందే. కానీ బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ అంటేనే వామ్మో అంటున్నారు. గత పది, పదిహేను రోజుల నుంచి బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోతుండడంతో చికెన్ అంటేనే భయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు ప్రతి ఆదివారం సరాసరిగా 1.80 లక్షల కేజీల చికెన్ అమ్మకాలు సాగిస్తుంటారు. కానీ ఈ ఆదివారం ఒక్కసారిగా చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. ఆదివారం రోజు కేవలం 50వేల కేజీల వరకు చికెన్ అమ్మకాలు జరిగినట్లు చెబుతున్నారు. గతంతో పోలిస్తే మూడింతల అమ్మకాలు పడిపోయినట్లు తెలుస్తోంది. సాధారణ రోజుల్లో 60వేల కేజీల నుంచి 80 వేల కేజీల వరకు అమ్మకాలు సాగిస్తుంటారు. కానీ అక్కంపల్లి రిజర్వాయర్‌లో చనిపోయిన కోళ్లను పడవేయడంపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం కావడంతో నల్లగొండ జిల్లాలో చికెన్ అమ్మకాలపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ పడింది. దీంతో ఆదివారం రోజున చికెన్ అమ్మకాలు లేక దుకాణాలన్నీ వెలవెలబోయాయి. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదని ప్రకటించినా చనిపోయిన కోళ్ల రిజర్వాయర్‌లో ప్రత్యక్షం కావడంతో ఈ ఎఫెక్ట్ చికెన్ అమ్మకాలపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు.

శుభకార్యాల్లో నో చికెన్..

ఏ చిన్న ఫంక్షన్ చేసినా చికెన్ ఉండాల్సిందే. పెద్ద శుభకార్యాల్లో అయితే చికెన్‌తో పలు రకాలుగా వంటలు చేసి పెడుతారు. శనివారం నల్లగొండలో ఫంక్షన్ ఉంటే ఒక అతను 60 కేజీల చికెన్ తీసుకెళ్లాడు. ఫంక్షన్‌కు వచ్చిన వారు చికెన్‌కు దూరంగా ఉన్నారు. 60 కిలోల చికెన్‌లో కేవలం 6 కేజీల చికెన్ మాత్రమే తినగా ..మిగతా చికెన్ మిగిలిపోయింది. బర్డ్‌ఫ్లూ ప్రచారంతో ఇటు చికెన్ కొనలేక దాని స్థానంలో మటన్, చేపలు పెట్టాల్సి వస్తుండడంతో ఫంక్షన్లు చేసే వారికి కూడా ఖర్చు భారీగా పెరుగుతోంది.

వ్యాపారుల ఉపాధిపై ఎఫెక్ట్..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో హోల్‌సేల్ వ్యాపారులు ఐదారుగురు వర్కర్లను పెట్టుకొని చికెన్ దుకాణాదారులకు అందిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో చికెన్ అమ్మకాలు లేకపోవడంతో చికెన్ వ్యాపారులతో పాటు, వాటిల్లో పనిచేసే వర్కర్ల ఉపాధిపై కూడా ప్రభావం పడింది.

80 శాతం అమ్మకాలు పడిపోయాయి



“ బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చికెన్ అమ్మకాలు 80 శాతం వరకు పడిపోయాయి. ఆదివారం రోజు 1600 కిలోల చికెన్ అమ్ముడు పోయేది. ఇప్పుడు 150 కిలోలు మాత్రమే అమ్ముడు పోయింది. నిన్న, మొన్నటి వరకు కొంతమేర అమ్మకాలు సాగగా.. రిజర్వాయర్‌లో కోళ్ల తేలడంతో అమ్మకాలు తగ్గడానికి కారణమైంది.

– సలీమొద్దీన్, చికెన్ వ్యాపారి, నల్లగొండ

కులగణన పేరుతో కాంగ్రెస్ డ్రామా

- సామాజిక న్యాయం గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు..
- ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

యాదగిరిగుట్ట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఒక డ్రామా అని, సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని, అయితే బీసీలకు సామాజిక న్యాయం చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ, ఇన్నాళ్లూ ఏం చేసిందన్నారు. 70 ఏళ్లలో ఒక్క ఓబీసీ వ్యక్తిని అయినా సీఎం చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎంతమంది ఓబీసీలు ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ గణనను చట్టబద్ధమైన సంస్థలతో సర్వే చేసి అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తే పార్లమెంట్‌లో ఆమోదించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సామాజిక న్యాయం పాటిస్తూ రాష్ట్రపతులను చేసిందని, కేబినెట్‌లో 27మంది ఓబీసీలు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే స్కాంలు, భూదందాలు, లంచాల పార్టీ అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు డబ్బు సంచులను పంపేందుకే తిరుగుతున్నాడని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్రమోదీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చిల్లరగా ఉన్నాయన్నారు. ప్రపంచ దేశాలు ప్రధాని నరేంద్రమోదీని ప్రశంసిస్తుంటే.. కాంగ్రెస్ ముఖం చాటేస్తుందన్నారు. భారతదేశాన్ని 6వ ఆర్థిక వ్యవస్థ నుంచి 3వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.రీజినల్ రింగ్ రోడ్డు బాధితులకు సంపూర్ణంగా పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి త్వరలోనే ఎంఎంటీఎస్‌ను యాదగిరిగుట్టకు తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన చేపల మార్కెట్

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో గల చేపల మార్కెట్ ఆదివారం కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ షాపుల వద్ద కొనుగోళ్లు జరగక వెలవెలబోగా.. చేపల మార్కెట్ వద్ద ప్రజలు ఎగబడి చేపల కొనుగోళ్లు చేశారు. కేజీ రవ్వ రూ.230 నుంచి రూ.250 వరకు, పాంప్‌లెట్స్ పెద్ద సైజ్ కేజీ రూ.100, కొర్రమీను కేజీ రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూసీ రోడ్డు చేపల కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది.

చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు →



క్లుప్తంగా

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

అర్వపల్లి: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి మెరుగు దేవయ్య తన గొర్రెలను శనివారం రాత్రి ఇంటి సమీపంలోని దొడ్డిలోకి తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 30 గొర్రెలు మృతిచెందాయి. ఆదివారం ఉదయం దేవయ్య గొర్రెల దొడ్డి వద్దకు వచ్చి చూడగా గొర్రెలు చనిపోయి ఉండడంతో లబోదిబోమంటూ స్థానికులకు విషయం తెలియజేశాడు. సుమారు రూ.3లక్షలకు పైగానే నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

అదృశ్యమైన వృద్ధురాలు మృతి

నూతనకల్: అదృశ్యమైన వృద్ధురాలు ఆదివారం మృతిచెందింది. ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రంలోని హరిజన కాలనీకి చెందిన ఇరుగు నర్సమ్మ(75)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నెల 13వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఆదివారం హరిజన కాలనీ పక్కనే బావిలో నర్సమ్మ మృతదేహం తేలిఉండటం స్థానికులు గమనించి వెలికితీశారు. మృతురాలి కుమారుడు సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహించొద్దు

- చిట్యాల మండలం ఏపూరులో మరోసారి మహిళల నిరసన



మద్యం విక్రయించొద్దని బెల్ట్ షాపు నిర్వాహకుడికి తెలుపుతున్న మహిళలు

చిట్యాల: మండలంలోని ఏపూరులో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయించొద్దని గ్రామ మహిళలు ఈ నెల 13న గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అయినప్పటికీ మద్యం అమ్మకాలు కొనసాగుతుండటంతో ఆదివారం మరోసారి మహిళలంతా కలిసి ర్యాలీ నిర్వహించి, గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయిస్తే రూ.లక్ష, బెల్ట్ షాపుల్లో మద్యం తాగి పట్టుబడిన వారు రూ.20,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించాలని షాపుల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, ప్రజాప్రతినిధులు సహకరించి ఏపూరులో బెల్ట్ షాపుల నిషేధానికి సహకరించాలని గ్రామ మహిళలు కోరుతున్నారు.

పెద్దగట్టుకు తరలిన భక్త జనం

- వివిధ శాఖల ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పన



విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న పెద్దగట్టు జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

చివ్వెంల, సూర్యాపేట టౌన్: ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర ఆదివారం ప్రారంభమైంది. భక్తులు భారీగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో 68 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నారు. గట్టు పైకి వెళ్లే దారిలో మూడు వైపులా ఉన్న మెట్ల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. ఆలయ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ పూర్తిస్థాయిలో అందుబాటులో రాకపోవడంతో భక్తులు నిరాశ చెందారు.

పార్కింగ్ ఉచితం

జాతరకు వచ్చే భక్తుల వాహనాలకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించారు. జాతర పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు భక్తుల వాహనాలకు అక్కడ ఉచితంగా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ

జాతర పరిసరాల్లో ఎలాంటి అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. వీరు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తున్నారు. గుట్టపై పొట్టేళ్లను బలిచ్చే దగ్గర వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లనున్నారు.

దాహార్తి తీర్చేందుకు భగీరథ నీరు

పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 12 చోట్ల కుళాయిలను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు.

అందుబాటులో అత్యవసర సేవలు

ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అరికట్టడానికి జాతర పరిసరాల్లో ఫైరింజన్లను సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా 108, 104 వాహనాలను కూడా అందుబాటులో ఉంచారు. ఎలాంటి ఘటనలు జరిగినా భక్తులకు ప్రథమ చికిత్స అందించేందుకు సూర్యాపేట జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 8 ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద డాక్టర్లతో పాటు ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది అందుబాటులో ఉంటారు.



లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు



నృత్యాలు చేస్తున్న శివసత్తులు



పొట్టేలును బలి ఇచ్చేందుకు వస్తున్న భక్తులు

సమన్వయం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు

చివ్వెంల (సూర్యాపేట): పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. ఆదివారం పెద్దగట్టు వద్ద జాతర ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర పెద్దగట్టు జాతర అని, ఎక్కువ మొత్తంలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయం చేసుకుంటూ జాతర విజయవంతమయ్యేలా కృషిచేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు జాతర పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. ఎవరైనా భక్తులు తప్పిపోతే కంట్రోల్ రూమ్ వద్దకి వచ్చి తెలియజేస్తే మైక్ ద్వారా ప్రకటిస్తామన్నారు. జాతరలో దుకాణాల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, కృష్ణయ్య, ఆంజనేయులు, అమీన్‌సింగ్ పాల్గొన్నారు.

దేవరపెట్టె విశిష్టత



సూర్యాపేటటౌన్: లింగమంతులస్వామి జాతరలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి కీలకమైన దేవరపెట్టె (చౌడమ్మతల్లి పెట్టె) పెద్దగట్టుకు చేరుకుంది. పెద్దగట్టుపై దిష్టిపూజ నిర్వహించేందుకు మహబూబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి తండ వంశస్తులు గత నెల 21న అందెనపు చౌడమ్మ పెట్టెను సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి తీసుకొచ్చారు. 22న అర్ధరాత్రి మెంతబోయిన, గొర్ల, రెడ్డి, మున్నా వంశస్తుల ఆధ్వర్యంలో దేవరపెట్టెను గట్టు పైకి తీసుకొచ్చి దిష్టిపూజ నిర్వహించారు. మరుసటి రోజు కేసారం గ్రామానికి దేవరపెట్టెను చేర్చారు. ఆదివారం అర్ధరాత్రి అందెనపు చౌడమ్మ పెట్టె గట్టుపైకి చేర్చడంతో జాతర ప్రారంభమైంది.

పెట్టెలో ఏముంది..

దేవరపెట్టెలో లింగమంతులస్వామి, 33మంది దేవతలు ఉంటారు. చౌడమ్మ, గంగమ్మ, యలమంచమ్మ, ఆకుమంచమ్మ, మాణిక్యమ్మ, ఐదుగురు చొప్పున రాజులు, చెంచులతో పాటు భూమినేడు, భూమసాని, వినా యకుడు, బ్రహ్మ, వరాహుడు, బొల్లావు, గొల్ల భామ, వసుదేవుడు, శ్రీకృష్ణుడు, పులి, భైరవుడు, పోతరాజు, బ్రాహ్మణుడు, నారథుడు, విశ్వామిత్రుడు, పాపనాక్షి, నాగేంద్రుడు ఉంటారు.

బస్సు సర్వీసులను పరిశీలించిన ఆర్‌ఎం

భానుపురి (సూర్యాపేట): పెద్దగట్టు జాతర సందర్భంగా సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ బస్ పాయింట్, బస్ సర్వీసులను ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు సూర్యాపేట డిపో నుంచి 60 బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మరిన్ని సర్వీసులు నడుపుతామన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎం సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో బస్సు సర్వీస్ పాయింట్ పరిశీలిస్తున్న ఆర్‌ఎం జానిరెడ్డి

రిజర్వేషన్ల పేరుతో ఎన్నికల వాయిదా సరికాదు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి: రిజర్వేషన్ల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడం సరికాదని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల పాలకవర్గాలు రద్దై ఏడాది దాటుతున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే రీతిలో ఉన్నాయని అన్నారు. వేసవిలో ప్రజాప్రతినిధులు లేకుండా గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎలా నివారిస్తారో ప్రభుత్వం ఒకసారి ఆలోచన చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో రాష్ట్రం కుంటు పడే విధంగా ఉందని, వెంటనే అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి రిజర్వేషన్ల సమస్యపై సుదీర్ఘ చర్చ జరిపి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి సబ్బండ వర్గాలకు న్యాయం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలపై కపట ప్రేమ చూపిస్తోందని, మొన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఇందుకు ఉదాహరణ అన్నారు. పేద, మధ్యతరగతి వాళ్ల మీద అనేక రకాలైన ట్యాక్స్‌లు వేసి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్, జిల్లా కమిటీ సభ్యుడు మేకనబోయిన శేఖర్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

దేవరకొండ: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై యువకుడు దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన శనివారం రాత్రి దేవరకొండ మండలం పాత్లావత్‌తండా (టి)లో జరిగింది. దేవరకొండ ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత్లావత్‌తండా(టి)కు చెందిన కొర్ర శరత్‌కు అదే తండాకు చెందిన పాత్లావత్ సేవా మధ్య శనివారం రాత్రి వాగ్వాదం జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో మద్యం మత్తులో ఉన్న శరత్ కత్తితో సేవాపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సేవాను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హైవేపై వాహనాల దారి మళ్లింపు



హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కోదాడ వద్ద దారి మళ్లిస్తున్న పోలీసులు



విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లిలో దారి మళ్లిస్తున్న పోలీసులు

సూర్యాపేట టౌన్, కోదాడ రూరల్, నార్కట్‌పల్లి: పెద్దగట్టు జాతర దృష్ట్యా విజయవాడ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారిమళ్లిస్తున్నారు.

- నార్కట్‌పల్లి వద్ద: హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద మళ్లించి నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌గర్, కోదాడ మీదుగా విజయవాడకు పంపిస్తున్నారు.
- కోదాడ వద్ద : విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను జాతీయ రహదారి 65పై కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ ఫ్లెటోవర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలను కిందికి దింపి హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి బైపాస్ మీదుగా హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ఎస్‌ఐలు, 12 మంది సిబ్బంది షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు. వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పోలీసులు రూట్‌మ్యాప్‌ను వివరిస్తున్నారు.
- ఖమ్మం వెళ్లే వాహనాలను..: హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద జాతీయ రహదారి 365బీబీ మీదుగా మళ్లిస్తున్నారు. ఇక్కడ షిఫ్ట్‌కు 8 మంది చొప్పున 16 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.
- కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలు ఎస్‌ఆర్‌ఎస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం వద్ద నుంచి సూర్యాపేట పట్టణానికి పంపుతున్నారు. ఇక్కడ కూడా షిఫ్ట్‌కు 8 మంది చొప్పున 16 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.
- సూర్యాపేట పట్టణం నుంచి కోదాడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రజా రవాణా వాహనాలు కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయ రహదారి మీదుగా రాఘవపురం స్టేజీ నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయ రహదారి 65పై గుంజలూరు స్టేజీ వరకు మళ్లించి కోదాడ, విజయవాడ వైపునకు పంపిస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

- బేతవోలులో రాళ్లు రువ్వుకున్న రెండు వర్గాలు
- పలువురికి గాయాలు
- గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు



గాయపడిన కాంగ్రెస్ కార్యకర్త

చిలుకూరు: చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సీతారామచంద్రస్వామి దేవాలయం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి ఆదివారం ఆలయ చైర్మన్ పెండ్యాల వీరస్వామి శంకుస్థాపన చేస్తుండగా.. అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులైన మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్య వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వట్టికూటి నాగయ్యను అవతల వర్గం నాయకులు దూషించడంతో గొడవ పెద్దదిగా మారింది. దేవాలయం లోపల జరుగుతున్న ఘర్షణ వ్యవహారం ఆలయం బయట ఉన్న ఇరువర్గాల వారికి తెలియడంతో ఒక్కసారిగా పెద్దఎత్తున ఘర్షణ వాతావరణ నెలకొంది. ఇరు వర్గాల వారు రాళ్లు విసురుకున్నారు. ఈ క్రమంలో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. వట్టికూటి నాగయ్య వర్గానికి చెందిన వెంకనర్సుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు ఇరు వర్గాల మధ్య కూడా వాగ్వాదం జరిగింది. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇరువర్గాలను అక్కడి నుంచి తరలించడంతో సమస్య సద్దుమణిగింది. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు, కోదాడ టౌన్, కోదాడ రూరల్ ఎస్‌ఐలు సురభి రాంబాబుగౌడ్, రంజిత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి బేతవోలు గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పికెట్ నిర్వహించారు.

భగ్గుమన్న విభేదాలు

బేతవోలు గ్రామంలో కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, వట్టికూటి నాగయ్య వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో కూడా వీరు బహిరంగంగానే ఘర్షణ పడ్డారు. గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించాలని అనుకున్న నాటి నుంచి వివాదాలు ఎక్కువైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయ పరిధిలో సుమారు 22 ఎకరాల భూమి ఉండగా.. ఎకరం అమ్మి నూతన దేవాలయం నిర్మించాలని ఒక వర్గం వారు... గ్రామంలో చందాలు వసూలు చేసి నూతన దేవాలయం నిర్మించాలని మరో వర్గం పట్టుబట్టారు. నూతన దేవాలయం నిర్మాణం పేరుతో పురాతన దేవాలయాన్ని కూల్చి భూమి లోపల గల బంగారు నిక్షేపాలు కాజేయాలని కుట్ర పన్నుతున్నారని గ్రామంలోని మరో వర్గం అంటున్నారు. నాలుగు నెలల క్రితం దసరా పండుగ రోజు సైతం అర్ధరాత్రి సమయంలో పెద్దఎత్తున ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు లాఠీచార్జి చేయగా.. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. గురు, శుక్ర, శనివారాల్లో గ్రామంలో కనకదుర్గమ్మ జాతర జరగనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో జాతర సజావుగా నిర్వహించడం పోలీసులకు సవాలుగా మారింది.

మృతదేహాన్ని తీసుకొస్తున్న ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

- నలుగురికి తీవ్ర గాయాలు

నకిరేకల్: మృతదేహాన్ని తీసుకొస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ మండలం మర్రూర్ శివారులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మర్రూర్ గ్రామానికి చెందిన లింగమ్మ తన పెద్ద కుమార్తె ఊరైన కట్టంగూర్ మండలం అయిటిపాములలో అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. లింగమ్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అయిటిపాముల నుంచి మర్రూర్‌కు ఆటోలో శనివారం రాత్రి తీసుకొస్తుండగా.. మర్రూర్ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో తిప్పర్తి నుంచి వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కొత్తపల్లి లచ్చయ్య, బత్తుల సైదులు, రమణ, లక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లింగమ్మ మృతదేహాన్ని మర్రూర్ తరలించి ఆదివారం అంత్యక్రియలు జరిపించారు. మృతురాలి మనవడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

చేనేత సహకార సంఘాల గడువు పెంపు

- మరో 6 నెలలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- పర్సన్ ఇన్‌చార్జిలకే బాధ్యతలు
- ఏడేళ్లుగా పాలకవర్గాలు లేక కునారిల్లుతున్న చేనేత సహకార సంఘాలు



పోచంపల్లి చేనేత సహకార సంఘం కార్యాలయం

భూదాన్‌పోచంపల్లి: చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలనే తిరిగి కొనసాగిస్తూ ప్రభుత్వం మరో 6 నెలల గడువును పొడిగించింది. పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం గత నెల 21న ముగిసింది. దీంతో 2025 జూలై 20 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏడేళ్లుగా ఎన్నికలు లేవు..

చేనేత సహకార సంఘాలకు గత ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. జిల్లాలో 2013 ఫిబ్రవరిలో చేనేత సహకార సంఘాలకు చివరగా ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరిలో పాలకవర్గాలకు ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యింది. కానీ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, వారితోనే పాలన నెట్టుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని చేనేత వర్గాలంతా ఆశపడ్డారు. చేనేత నాయకులు పలుమార్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కానీ ప్రభుత్వం మరోసారి పర్సన్ ఇన్‌చార్జిలనే కొనసాగిస్తూ గడువు పొడిగించింది.

13 దఫాలుగా గడువు పొడిగిస్తూ...

2018లో చేనేత సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత నియమించిన పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని ప్రతి ఆరు నెలలకొకసారి గడువు పొడిగించుకొంటూ ఈ ఏడేళ్ల కాలంలో 13 దఫాలుగా పొడిగించారు.

ఉమ్మడి జిల్లాలో సంఘాలు ఇలా...

ఉమ్మడి జిల్లాలో చేనేత సహకార సంఘాలు, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84 ఉన్నాయి. ఇందులో యాదాద్రి జిల్లాలోనే అత్యధికంగా 43 సంఘాలు ఉండగా 12 క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. వీటిలో మొత్తం 18,882 మంది చేనేత కార్మికులు సంఘం సభ్యులుగా ఉన్నారు. అలాగే నల్లగొండ జిల్లాలో 25 సహకార సంఘాలు, 5 పవర్ లూమ్ సంఘాలు ఉండగా, ఇందులో మొత్తం 6588 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 3 సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. 330 మంది సంఘ సభ్యులున్నారు.

అచేతనంగా సంఘాలు

ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడం వల్ల చేనేత సహకార సంఘాలు కార్మికులకు చేతినిండా పనికల్పించలేకపోతున్నాయి. పర్సన్ ఇన్‌చార్జిలు వెంటనే కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోలేకపోతుండడంతో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడంలేదని చేనేత కార్మికులు వాపోతున్నారు. ముఖ్యంగా నూలు, రంగులు, రసాయనాలు తదితర ముడిసరుకు సకాలంలో అందించలేకపోతున్నారు. దీంతో చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలీ మగ్గాలపై పనిచేస్తున్నారు. చేనేత సహకార సంఘాలలో అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గాయి. ఒక్కో చేనేత సహకార సంఘంలోనే కోటి 10లక్షల విలువైన చేనేత వస్త్రాల స్టాక్ నిల్వ ఉంది. భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, కొయ్యలగూడెం, భువనగిరి తదితర సంఘాలకు ఏడాదికి 2కోట్లకు పైగా వస్త్రాలను తయారు చేయించే సామర్థ్యం ఉంది. కానీ అందుకనుగుణంగా టెస్కో వస్త్రాలను కూడా కొనడంలేదు. ఒకవేళ అరకొర వస్త్రాలను కొనుగోలు చేసినా సకాలంలో బిల్లులు చెల్లించడంలేదు. ఎన్నికలు నిర్వహిస్తే సమస్యలన్నింటికీ చెక్ పడుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి



చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘం కన్నతల్లిలాంటిది. గత ప్రభుత్వం దీర్ఘకాలంగా ఎన్నికలు నిర్వహించకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఈ వ్యవస్థను పటిష్టం చేయాలంటే తక్షణమే ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాన్ని నియమించాలి. పాలకవర్గం ఉంటే కార్మికులకు కావల్సిన అవసరాలను తీరుస్తుంది.

– కర్నాటి పురుషోత్తం, తెలంగాణ చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు


జూలై 20 వరకు గడువు పెంపు



చేనేత సహకార సంఘాలకు నియమించిన పర్సన్ ఇన్‌చార్జిల గడువు మరో 6 నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని చేనేత సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం జనవరి 21కి ముగిసింది. దీంతో జూలై 20 వరకు గడువు పెంచింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడికి అందేలా కృషి చేస్తున్నాం.

– పద్మ, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్

సాధకబాధకాలు చెప్పే అవకాశం లేదు



చేనేత సహకార సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చేనేత కార్మికుడే సంఘానికి చైర్మన్‌గా ఉంటే మా సాధకబాధకాలు తెలిసి మాకేం అవసరమో సమకూరుస్తారు. కానీ అధికారులతో అంత చొరవగా మాట్లాడలేం, మా సమస్యలను చెప్పుకోలేం. వెంటనే సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాం.

– దుద్యాల పాపయ్య, చేనేత సహకార సంఘం సభ్యుడు, భూదాన్‌పోచంపల్లి